# నమస్తే తెలంగాణ

DISTRICT SUPPLEMENT

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

గురువారం 20 జూలై 2023 | THURSDAY, JULY 20, 2023

MANCHERIAL | KUMURAM BHEEM ASIFABAD

పేజీలు : 12 PAGES


## మూడు గంటలిస్తే మీరెందుకు..?



ఎవుసానికి మూడు గంటలే కరెంట్ ఇస్తమని కాంగ్రెస్ లీడరు రేవంత్ రెడ్డి అంటున్నడు. మరి ఇగ మూడు గంటలే ఇస్తే మీరెందుకు.. 24 గంటల కరంట్ ఇస్తున్న సీఎం కేసీఆర్ ను కాదని మిమ్మల్ని నెత్తిన పెట్టుకోవల్నా. గతంలో మీరు చేసింది చాలదా.. మళ్లా ఇగ బోర్ల కాడ పడుకోవాల్నా. ఒక్క రోజన్నా మీ ప్రభుత్వాలు మా గురించి ఆలోచించినయా.. ? రైతులకు మంచి చేయాల్నంటే ముందుగాల వాళ్లమీద ప్రేమ ఉండాలే. సీఎం కేసీఆర్ ఇంతగానం ఆలోచించి మంచిజేసిండు. గతంలో మీరెందుకు చేయలేదో కాంగ్రెసోళ్లు చెప్పాలే. రైతుల మీద రేవంత్ రెడ్డి మాటలు మంచిగ లేవ్. కరెంట్ ఇస్తనే మా పంటలు పండుతయ్. ఎవుసం అంటే తెలుసుకొని మాట్లాడితే మంచిగుంటది. గప్పుడే ప్రజలు నిన్ను నెత్తిన ఎత్తుకుంటరు. గిట్ల ఏది పడితే అది మాట్లాడితే మా పని మేం జేస్తం. **-సున్నం రాజు( రైతు మెట్‌పల్లి)**






సీసీసీ నస్పూర్ : సీతారాంపల్లి రైతు వేదిక వద్ద నినాదాలు చేస్తున్న మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, రైతులు



బెల్లంపల్లి రూరల్ : తాళ్ల గురిజాల రైతు వేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



లింగాపూర్ : కంచన్‌పల్లి రైతు వేదికలో తీర్మాన పత్రం చూపుతున్న ఆసిఫాబా ద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్ఎస్ నాయకులు, రైతులు

# కాంగ్రెస్ కుట్రలపై రైతన్న భగ్గు

..మధ్యపేజీలో

- చెప్పకపోతే.. బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- మీ చీకటి పాలన మాకొద్దంటూ ముక్తకంఠంతో నినదించిన కర్షకలోకం
- దుర్మార్గపు ఆలోచనలు చేస్తే ఊరి పొలిమేరల్లోకి కూడా రానియ్యం..
- రేవంత్‌రెడ్డిని కడిగిపారేసిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతాంగం
- మూడో రోజూ రైతు వేదికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తీర్మానాలు

**మూడు గంటల కరెంటు ఎట్ల సరిపోతదో చెప్పాలని ఆగ్రహం**

**'కాంగ్రెస్ పార్టీ కుట్రపూరిత** ఆలోచనలపై రైతాంగం భగ్గుమంది. వ్యవసాయానికి మూడు గంటల కరెంటు ఎట్ల సరిపోతదో రైతుల మధ్యకొచ్చి చెప్పాలి. నోటికొచ్చినట్లు అవగాహన లేకుండా ఎట్లవడితే అట్ల మాట్లాడితే కుదరదు. బహిరంగ క్షమాపణ చెప్పకపోతే ఊరి పొలిమేరల్లోకి కూడా రానియ్యం.. వస్తే తరమి తరిమి కొడుతం. గతంలో కరంటియ్యక ఎవుసాన్ని ఆగం చేసింది చాలదా? మీ పెద్దన్న చంద్రబాబు రైతులపై కాల్పులు జరిపిస్తే.. నీవేమో కరెంటు మూడు గంటలే సాలంటవా?' అని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై మూడో రోజైన బుధవారం కూడా రైతన్నలు మండిపడ్డారు. రైతువేదికల్లో నిర్వహించిన రైతుసభల్లో తమ అభిప్రాయాలను ముక్తకంఠంతో తెలియజేశారు. 'మూడు గంటల కరెంట్ ఇస్తామంటున్న కాంగ్రెస్ పార్టీ మాకు వద్దు.. మూడు పంటలకు కరెంట్ ఇస్తున్న సీఎం కేసీఆర్ కావాలంటూ' తీర్మానాలు చేశారు. కాగా.. మంచిర్యాల నియోజకవర్గంలోని నస్పూర్ సీతారాంపల్లి, దండేపల్లి, లక్షెట్టిపేట మండలాల్లోని జెండా వెంకటాపూర్ రైతువేదికల్లో ఎమ్మెల్యే దివాకర్‌రావు, బెల్లంపల్లి నియోజవకర్గంలోని నెన్నెల మండలంలో గల చిత్తాపూర్, గురిజాల మండల రైతువేదికల్లో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఆసిఫాబాద్ నియోజకవర్గం లింగాపూర్‌లో ఎమ్మెల్యే ఆత్రం సక్కు పాల్గొన్నారు. **- మంచిర్యాల, జూలై 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)**

# గెరువియ్యలే..

## ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మోస్తరు వాన

**ఉమ్మడి ఆదిలాబాద్** జిల్లావ్యాప్తంగా వాన గెరువియ్యడం లేదు. మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తుండడంతో జనం ఇండ్లు వదిలి బయటకు రావడం లేదు. వర్షానికి తోడు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు చేరుతుండడంతో వాగులు, వంకలు ఉప్పొంగుతున్నాయి. చెరువులు మత్తడి దుంకుతుండగా.. జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. జలపాతాలు జలకళను సంతరించు కోగా.. లోతట్టు ప్రాంతాల్లోని చేలలో నీరు చేరడంతో మొక్కలు మునిగిపోయాయి. కొంచెం ఆలస్యమైనా వర్షాలు పడుతుండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరి, పత్తి మొక్కలకు ఇటీవల కురుస్తున్న వానలు మేలు చేస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా.. ఆదిలాబాద్ జిల్లాలో బుధవారం సగటున 53.9 మిల్లీమీటర్ల వర్షం కురియగా, నిర్మల్‌లో 52.3, ఆసిఫాబాద్‌లో 35.2, మంచిర్యాలలో 15.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

**- మంచిర్యాల, జూలై 19(నమస్తే తెలంగాణ ప్రతినిధి)**

- ఆదిలాబాద్‌లో అత్యధికంగా 53.9 మిల్లీమీటర్లు
- మంచిర్యాలలో అల్పంగా 15.7 మిల్లీమీటర్లు
- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు
- మత్తడి దుంకుతున్న చెరువులు
- జలాశయాలకు జలకళ .. సాగుకు ప్రయోజనం..



కెరమెరి : ఝరి గ్రామ శివారులోని చేలలో నిలిచిన వర్షపు నీరు



..మధ్యపేజీలో

చింతలమానేపల్లి : ఉధృతంగా ప్రవహిస్తున్న దిందా-కేతిని వాగు